క్లుప్తంగా

1969 తెలంగాణ ఉద్యమంపై సదస్సు



వెంకయ్యను సన్మానిస్తున్న దృశ్యం

మధిర: మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ విద్యార్థులకు తెలంగాణ ఉద్యమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ సదస్సుకు ఖమ్మం ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ గట్టిగుండె వెంకయ్య పాల్గొని మాట్లాడారు. 1969 తెలంగాణ ఉద్యమాన్ని వివరిస్తూ తెలంగాణ వెనుకబాటుతనాన్ని, పెద్దమనుషుల ఒప్పందం ఉల్లంఘన విధానాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు వెంకయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏఎల్ఎన్ శాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ కె.రవికుమార్, చరిత్ర అధ్యాపకులు కె.వీరన్న, పాల్గొన్నారు.

ఇంటర్ టాపర్‌కు సత్కారం



షహనాజ్‌ను సత్కరిస్తున్న మత్స్యకారుల సంఘం నాయకులు

వైరా: ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించిన మత్స్యకారుడి కూతురిని వైరా మత్స్యకారులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. కొణిజర్ల మండలంలోని లాలాపురానికి చెందిన షేక్ హుస్సేన్, సైదు ల కుమార్తె షహనాజ్.. కారేపల్లిలోని గురుకుల జూనియర్ కళాశాలలో ఎంపీసీ చదువుతుంది. ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో తనకు 470 మార్కులకు గాను 462 సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటింది. దీంతో మత్స్య సహకార సొసైటీ అధ్యక్షుడు షేక్.రహీమ్, సభ్యులు షహనాజ్‌ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. లాలాపురం గ్రామానికి చెందిన మత్స్యకారులు పాల్గొన్నారు.


'కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మరు'

బోనకల్లు: మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ అన్నారు. మండలంలోని రాయన్నపేటలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చి ఓటు అడగాలని, ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నర నెలలు గడిచినా పథకాల అమలులో విఫలమయ్యారని, రాష్ట్రంలో ఇప్పటికే ప్రభుత్వ వ్యతిరేకత మొదలైందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపుకై ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు, నాయకులు వేమూరు ప్రసాద్, జంగా రవికుమార్, ఇటికాల శ్రీనివాసరావు, రవీంద్రర్, సేవా హనుమంతరావు, శ్రీనివాసరావు, ప్రసాద్, రాధాకష్ణ, సాయి, వెంకటేశ్వర్లు, కనకయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

భార్గవ్‌ను అభినందించిన సీఎం

ఎర్రుపాలెం: భువనగిరి పార్లమెంట్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్, ఎర్రుపాలెం గ్రామానికి చెందిన అనుమకొండ బార్గవ్‌ను సీఎం రేవత్‌రెడ్డి అభినందించారు. శుక్రవారం హైద్రాబాద్‌లో జరిగిన సోషల్ మీడియా సమావేశంలో సీఎం అభినందించగా.. భార్గవ్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సీఎం స్ఫూర్తితో పార్టీ బలోపేతం దిశగా కార్యాచరణ మరింతగా వేగవంతం చేస్తానని తెలిపారు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తుపల్లి విద్యార్థుల ప్రతిభ



ఎ.తేజస్వీ

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని డాక్టర్ కేకేఆర్ సీఎస్ఆర్ ఆధిత్య పాఠశాల పూర్వ విద్యార్థి ఎ.తేజస్వీని జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఆలిండియా కేటగిరిలో 8వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా కేకేఆర్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కేకేఆర్, పాఠశాల డైరెక్టర్లు అవినాష్, చలసాని శ్రీవైష్ణవి, హరీష్, ప్రిన్సిపాల్ చైతన్య, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

రేజర్లలో వైద్య శిబిరం

సత్తుపల్లిరూరల్: సింగరేణి కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేంరాజు, సత్తుపల్లి జేవీఆర్ ఓసీ పీఓ ఎస్వీఆర్ ప్రహ్లాద్ ఆదేశాలతో శుక్రవారం సింగరేణి ప్రభావిత గ్రామమైన రేజర్లలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సింగరేణి వైద్యులు నర్సింహారావు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.శిరీష, సంక్షేమ అధికారి కె.దేవదాస్, జేవీఆర్ ఓసీ డిస్పెన్సరీ స్టాఫ్ నర్స్ శరణ్య, అశోక్ పాల్గొన్నారు.

రోడ్లకు మోక్షమెప్పుడో ?

- కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు
- ప్రశ్నార్థకంగా మారిన బీటీ రోడ్లు
- ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా తయారైన గొల్లపూడి - ఖానాపురం రహదారి

వైరారూరల్: పల్లెలను కలుపుతూ వేసే అంతర్గత రహదారుల నిర్మాణాలకు ఏళ్ల తరబడి మోక్షం కలగడం లేదు. ప్రజలు, ప్రజాప్రతినిధులు లింకు రోడ్ల అభివృద్ధి కోసం పంపించే ప్రతిపాదనలు.. కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయే కానీ ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

ఎదురు చూపులు ఫలించేదెప్పుడు..

మండల పరిధిలోని గొల్లపూడి నుంచి ఖానాపురం వెళ్లేందుకు కొన్నేళ్ల క్రితమే మట్టి రోడ్డు వేశారు. ఈ రెండు గ్రామాలకు దాదాపు రెండున్నర కిలో మీటర్ల దూరం ఉంది. ఈ రోడ్డు పంచాయితీ రాజ్ నుంచి అర్అండ్‌బీ పరిధిలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్న ఫలితం లేకుండా పోయింది. ఈ మట్టి రోడ్డును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అధికారులు గతంలోనే గుర్తించినప్పటికీ నిధులు మంజూరు కాకపోవడంతో ఇటుగా అభివృద్ధి బాటలు పడలేదు. అంతేకాకుండా ఈ రహదారికి ఇరువైపులా వందలాది ఎకరాల పంట భూములు ఉండడమే కాకుండా ఇటు వైపు నుంచి ఖానాపురం, గన్నవరంతో పాటు కృష్ణా జిల్లా నెమలి ఆపై గ్రామాలకు వెళ్లేందుకు వెసులుబాటు ఉంది. ఈ రోడ్డు బీటీగా మారకపోవడంతో రైతులు మినహా దీనిని ఎవరు వినియోగించడం లేదు. దీనికి ప్రధాన కారణం రహదారి పొడవున గుంతలు ఏర్పడి అధ్వానంగా ఉండడం, ఇరువైపులా చెట్లు పెరిగి అడవిని తలపిస్తుంది. ఈ రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో ఖానాపురం వెళ్లేందుకు రెబ్బవరం, కొండకొడిమ క్రాస్ రోడ్డు మీదుగా చుట్టూ తిరిగి అదనంగా మరో 6 నుంచి 8కిలో మీటర్లు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది.

నిధులు మంజూరైతేనే..

ఇటుగా బీటీ రోడ్డు వేయాలని గ్రామస్తులు దశాబ్దా కాలంగా కోరుతున్నారు. నియోజకవర్గ రిధిలో ఇటువంటి అంతర్గత లింకు రోడ్డులను బీటీ రోడ్లుగా మార్చేందుకు గతంలోనే నిధులు మంజూరు అయ్యాయి. కానీ గొల్లపూడి - ఖానాపురం రహదారి మరమ్మతులకు మాత్రం నేటికీ నిధులు మంజూరు కాకపోవడంతో గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పాలకులు మారుతున్న నేటికీ ఈ రోడ్డు తల రాత మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి రహదారులపై దృష్టి సారించి సమస్యను పరిష్కారించాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

అధ్వానంగా రహదారులు



కంకరతేలి అధ్వానంగా తయారైన కారేపల్లి - బస్వాపురం రోడ్డు



అధ్వానంగా ఉన్న గిద్దెవారిగూడెం రోడ్డు

కారేపల్లి: రహదారులు అధ్వానంగా మారాయి. దీంతో మండల ప్రజలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలో సుమారు 60వేల జనాభా, 41 గ్రామ పంచాయతీలు, 116 శివారు గ్రామాలతో విస్తరించి ఉన్న రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలైన తమ గ్రామాలకు మాత్రం తారురోడ్డు లేదని, గుంతలమయమైన మట్టి రోడ్లతో, కంకర తేలిన మెటల్ రోడ్లతో నరకయాతన అనుభవిస్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు గోడు వెళ్లబుచ్చుకుంటున్నారు.

అరకొరగానే పనులు..

గిద్దెవారిగూడెం నుంచి ఖమ్మం-ఇల్లందు ప్రధాన రహదారి 1కిలో మీటరు మేర ఉన్న మెటల్ రోడ్డుకు ఇప్పట్లో మోక్షం కలిగేటట్లు లేదు. సంబంధిత అధికారులు సాంకేతిక కారణాలు అంటూ సాకు చూపిస్తూ.. బీటీరోడ్డుగా మారాల్సిన రహదారి కంకరపోసి వదిలేశారు. ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చితే.. కారేపల్లి మండల కేంద్రానికి సుదూరంలో ఉన్న మాణిక్యారం, ఎర్రబోడు, చీమలపాడు, రేలకాయలపల్లి, మాటిమీదిగుంపు, బాజుమల్లాయిగూడెం, జైత్రాంతండా, గాదెపాడు, కొమ్ముగూడెం, కోమట్లగూడెం గ్రామ పంచాయతీలకు మార్గం సుగమనం అవుతుంది.

- కారేపల్లి బీసీ కాలనీ నుంచి బస్వాపురం వరకు 4కిలో మీటర్ల మేర కంకర రోడ్డు అధ్వానంగా తయారైంది.
- గేటుకారేపల్లి రైల్వేగేటు నుంచి అనంతారం గ్రామం వరకు 3కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు అధ్వానంగా తయారైంది.
- గాజులతండా గ్రామం నుంచి నడిమూరు - సీతారాంపురం రోడ్డు వరకు 3కిలో మీటర్లు, ఉసిరికాయలపల్లి డొంక రోడ్డు నుంచి శాంతినగర్ గ్రామ వరకు మట్టి రోడ్లు ఉండటంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డంతా కొట్టుకుపోయి మోకాళ్ల లోతు గోతులు ఏర్పడ్డాయి.

ఇబ్బంది పడుతున్నాం..



పాలకులు మారిన మా రోడ్డు మారలేదు. ఎన్నో సార్లు పెద్ద సార్లకు మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. కంకర తేలిన రోడ్డులో పోవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇకనైన బీటీ రోడ్డు వేసి ప్రజలు ఇబ్బందులు తీర్చాలి.

– కల్తి భద్రయ్య, గిద్దెవారిగూడెం

అభివృద్ధి చేయాలి..



గొల్లపూడి - ఖానాపురం గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రహదారి పంచాయతీరాజ్ నుంచి ఏళ్ల కిందట అర్అండ్‌బీ పరిధిలోకి మారిన నేటికీ అభివృద్ధికి నోచుకోలేదు. ఈ గ్రావెల్ రోడ్డును బీటీగా మార్చాలని గ్రామస్తులు చేసిన ప్రతిపాదనలు శూన్యం.

– షేక్.కరీం, గొల్లపూడి

చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది..



గుంతలతో అధ్వానంగా ఉన్న ఖానాపురం-గొల్లపూడి గ్రామాల మధ్య ఉన్న లింకు రోడ్డును బీటీ రోడ్డుగా మార్చకపోవడంతో అదనంగా 6 కిలో మీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుంది. ప్రజల అవసరాలను దృష్ట్యా ఈ రోడ్డును బీటీగా మార్చాలి.

– చింతల గోపి, ఖానాపురం

వైభవోపేతంగా విగ్రహాల ప్రతిష్ఠ



ధ్వజస్తంభం ప్రతిష్ఠ చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలకేంద్రంలో నిర్మించిన శ్రీ దాసాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం దాసాంజనేయస్వామి, గణపతి, సుబ్రహ్మణస్వామి, జంట నాగుల విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. గ్రామ పురోహితులు కొత్తూరి రాజేశ్వరశాస్త్రి ఆధ్వర్యంలో పలువురు అర్చకుల వేద మంత్రోచ్చారణలు, మేళతాళాలతో విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరిగింది. మండలంలోని రేమిడిచర్ల, కొత్తపాలెం, మీనవోలు, తెల్ల పాలెం, బనిగండ్లపాడు, పెద్దగోపవరం, తక్కెళ్లపాడు, తదితర గ్రామాల భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం అంతటా భక్తులతో కిటకిటలాడింది. జైశ్రీరామ్, జై హనుమాన్ అంటూ భక్తులు చేసిన నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. మహాపూర్ణాహుతి, కుంభాభిషేకం, జ్వాలాదర్శనం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించి అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దొడ్డా అశోక్, గోగినేని సూరి, మగనం వీరభద్రం, జానకి శివ, దూదిగం పకీరయ్య, చిన్నాల నాగబాబు తదితరులు ఉన్నారు.

శ్రీ కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

చింతకాని: మండలంలోని బస్వాపురం గ్రామంలో గౌడ కులస్తులు నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ కంఠమహేశ్వరస్వామి, సురమాంబ తల్లి విగ్రహాలను శుక్రవారం అత్యంత వైభవంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పూజారి గౌడ జెట్టి.. అంజయ్య ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. గౌడ కులస్తులు జలబిందెలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. గౌడ కులస్తులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పేరుపల్లిలో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

కారేపల్లి: మండలంలోని పేరుపల్లి గ్రామంలో శ్రీగురువమ్మతల్లి-సర్వారెడ్డి ఉత్సవ విగ్రహాలను ఎండ్లబండిపై మేళతాళాల నడుమ ఇంటింటికీ తిప్పుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో పాటు, పూలకప్పెర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మగవారు స్త్రీ వేషధారణలో అలంకరించుకొని గ్రామ పురవీధుల్లో ప్రదర్శన చేస్తూ పసుపు కుంకుమ సేకరించి, అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ పుట్టా నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఘనంగా కనకదుర్గమ్మ జాతర



పూజలు చేస్తున్న మహిళలు

కొణిజర్ల: మండలంలోని బస్వాపురంలో కనకదుర్గమ్మ జాతర వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా చైత్రమాసం తదియ తర్వాత అమ్మవారి జాతర వేడుకలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి గ్రామంలో ప్రభల ఊరేగింపు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారు జామునుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారు వెలసిందని చెప్పుకునే మర్రి చెట్టు వద్ద.. పొంగళ్లు తయారు చేసి అమ్మవారికి సమర్పించారు. కోళ్లు, మేకలను బలి ఇచ్చి తమను చల్లగా చూడమని మొక్కుకున్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఎంపీపీ గోసు మధు, ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దొండపాటి లక్ష్మి నరసింహారావు దంపతులు, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లి: పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని టౌన్-2 ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నందున కల్పతరురోడ్, మహాత్మాగాంధీరోడ్‌లలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శరత్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు కరెంట్ ఉండదని వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

తల్లాడ: మండలంలోని మిట్టపల్లి సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఆయా గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా బంద్ చేయనున్నట్లు విద్యుత్ శాఖా ఏఈ రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మిట్టపల్లి, నూతనకల్, వెంగన్నపేట, రగంబంజర, మల్సూర్‌తండా, రామానుజవరం, లక్ష్మీపురం, పినపాక, వెంకటాపురం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

తల్లాడ: ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు గెలుపును కాంక్షిస్తూ శుక్రవారం మండలంలోని ముద్దునూరు, మిట్టపల్లి, కుర్నవల్లి గ్రామాల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి మున్నా మిత్రా మాట్లాడుతూ.. జిల్లాలోని ఆదివాసీలు, నిరుపేదల కోసం నిరంతరం కృషి చేస్తున్న వ్యక్తి వినోద్‌రావు అని ఆయనను గెలిపించి మోదీకి కానుకగా ఇవ్వాలన్నారు. బీజేపీ తల్లాడ మండల అధ్యక్షుడు వెంకటరామారావు, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, సుధాకర్, రవితేజ, రామారావు, సాయిచంద్ పాల్గొన్నారు.

ఓటరు చైతన్య యాత్ర ప్రారంభం



ఓటరు చైతన్య యాత్రను ప్రారంభిస్తున్న తహసీల్దార్

కల్లూరురూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ.. చెన్నూరు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు దంతా సుధాకర్ బైక్‌పై ఓటర్ చైతన్య యాత్ర చేపట్టారు. ఈ యాత్రను శుక్రవారం తహసీల్దార్ పులి సాంబశివుడు ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు ఓటు విలువ తెలిసేలా తన బైక్‌కు బ్యానర్లు, ఫ్లెక్సీలు కట్టి అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు ఎంపీడీఓ చంద్రశేఖర్, ఐకేపీ ఏపీఎం వెంకట రామారావు, తహసీల్ సిబ్బంది పాల్గొన్నారు.

అందరూ ఐక్యంగా కష్టపడండి..



ప్రచారంలో పాల్గొన్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాగమయి, అభ్యర్థి రఘురాంరెడ్డి

సత్తుపల్లిటౌన్: రానున్న పదిహేను రోజులు పార్టీ శ్రేణులు కలిసికట్టుగా కష్టపడడం ద్వారా కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డితో కలిసి సత్తుపల్లిలో శుక్రవారం ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసల జ్యూయెలరీని ప్రారంభించగా, కాంగ్రెస్ నాయకులు మలిరెడ్డి మురళీరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పార్టీ శ్రేణులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి విజయమే కాక అత్యధిక మెజార్టీ సాధించేలా కృషి చేయాలని సూచించారు. మాజీ సర్పంచ్ మందపాటి ముత్తారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణితో పాటు బచ్చు శ్రీనివాసరావు, ఉడతనేని అప్పారావు, ఎం.డీ.కమల్‌పాషా, సతీష్, గంగిశెట్టి ప్రసాద్, వాసు, చల్లగుళ్ల నర్సింహారావు, గాదె సుబ్బారెడ్డి, దారా కృష్ణారావు, చిల్లగుళ్ల వెంకటేశ్వరరావు, సాంబశివరావు, ప్రభాకర్‌రావు, మందపాటి పద్మజ్యోతి పాల్గొన్నారు.

సొంత గూటికి మాజీ మంత్రి సంభాని



పార్టీలో చేరిన మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, ఆయన అనుచరులు

సత్తుపల్లి: మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ హైదరాబాద్ గాంధీభవన్‌లో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, కోదండరామిరెడ్డి శుక్రవారం సమక్షాన కాంగ్రెస్‌లో చేరారు. ఆయన వెంట కొర్రపాటి సాల్మన్‌రాజు, గోళ్ల అప్పారావు, బైరెడ్డి మనోహర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, చెలికాని రాజబాబు, కొండూరు కిరణ్, తుమ్మూరు లక్ష్మారెడ్డి, కిన్నెర లాజర్, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, సమ్మయ్య, గోపాలస్వామి, అఫ్రోజ్, సందీప్, సురేష్ తదితరులు కూడా హస్తం కండువా కప్పుకున్నారు. ఈసందర్భంగా సంభాని మాట్లాడుతూ కాంగ్రెస్‌లో చేరడం సొంతగూటికి వచ్చినట్లు ఉందని తెలిపారు. ఇక కల్లూరు మండలానికి చెందిన మాదిరాజు లక్ష్మణ్‌రావు, చోటు, షేక్ సమీర్ తదితరులు కూడా కాంగ్రెస్‌లో చేరారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



మాట్లాడుతున్న ఖమ్మంరూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి

ముదిగొండ: అంతరాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి అన్నారు. ముదిగొండ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఖమ్మం రూరల్, ముదిగొండ సెక్టార్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో ఖమ్మం రూరల్ సీఐ రాజిరెడ్డి, ఎస్సై నరేష్‌లు పాల్గొన్నారు.

నియామకం



జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వరప్రసాద్‌ను అభినందిస్తున్న అలవాల కరుణాకర్

సత్తుపల్లిటౌన్: నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బేతంపూడి వరప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ నియామక పత్రం అందించి అభినందించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ.. ఈ నెల 29న సత్తుపల్లిలో జరిగే భారీ క్రిష్టియన్ మైనార్టీ సభకు అందరు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.యాకోబు, ఎ.శ్యామ్‌సన్, మ్యాథ్యూస్, దేవసహాయం, జాన్‌మార్క్, దానియేలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం

మధిర: మధిర పట్టణంలోని మదర్ థెరిస్సా మానసిక దివ్యాంగుల సేవాసదనంలో దివ్యాంగులకు శుక్రవారం అన్నదానం చేశారు. పూర్ణకంటి విజయరాణి కుమార్తె అక్షయ పుట్టినరోజు సందర్భంగా సేవాసదనంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవాసదనం నిర్వాహకురాలు నల్లపు స్వర్ణలత మాట్లాడుతూ.. మానసిక వికలాంగుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమ, ఆప్యాయత కలిగి ఉండాలన్నారు.

అంకమ్మ దేవాలయంలో..



అన్నదానం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో శుక్రవారం అంకమ్మ జాతర సందర్భంగా అన్నదాన కార్యక్రమం జరిగింది. అంకమ్మ జాతర పురస్కరించుకొని దాతలు తుమ్మపల్లి వెంకటేశ్వరరావు, అరుణ, ధనుంజరావ్, లక్ష్మి దంపతుల సహకారంతో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని తల్లాడ ఎంపీపీ శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. అంకమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దొడ్డా చిన్న శ్రీనివాసరావు, మారెళ్ల దేవేందర్, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, కోవెల కృష్ణయ్య, దిరిశాల శ్రీనివాసరావు, వెంకటయ్య, దుగ్గినేని సత్యనారాయణ పాల్గొన్నారు.

వృద్ధులకు అల్పాహారం

వైరారూరల్: వైరా మున్సిపాలిటీ పరిధిలోని టీచర్స్ కాలనీకి చెందిన గంధి ప్రవీణ్ కుమార్ శుక్రవారం తన పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకొని మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో అంజలి, రజిని, పద్మ, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

బుగ్గిపాలవుతున్న పచ్చని చెట్లు

- పంట వ్యర్థాలకు నిప్పు పెడుతున్న రైతులు
- తగలబడి పోతున్న రోడ్డు పక్కన చెట్లు
- పట్టించుకోని అధికారులు



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టును తొలగిస్తున్న అధికారులు



కాలిపోయిన చెట్లు

కొణిజర్ల: కొణిజర్ల, తనికెళ్ల, వెంకటాయపాలెంకు చెందిన పలువురు రైతులు తమ పొలాలను శుభ్రం చేసుకునే పనిలో భాగంగా చెత్తను కాల్చి వేస్తున్నారు. నిప్పు పెట్టి పట్టించుకోక పోవడంతో అవి రోడ్డు పక్కన ఉన్న చెట్లకు అంటుకుని మంటలు కిలో మీటర్ల దూరం వ్యాపిస్తున్నాయి.

తప్పిన ప్రమాదం..

రెండు రోజుల క్రితం తనికెళ్ల సమీపంలోని పెట్రోల్ బంక్ సమీపానికి మంటలు రావడంతో వారు అప్రమత్తమై ఫైర్‌ఇంజన్‌తో మంటలార్పించారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం తనికెళ్ల సమీపంలోనే మంటలకు కాలిపోయిన ఓ చెట్టు కూలి రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో ఏ వాహనం రోడ్డుపై రాకపోవడంతో ప్రమాదం తప్పింది. పోలీసులు, పంచాయతీ రాజ్ అధికారులు స్పందించి చెట్టును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఇప్పటికే చెట్లు లేక, వానలు పడక కరువు ఛాయలు అలుముకుంటుంటే ఉన్న కాసిన్ని చెట్లు మంటలకు కాలి బూడిదవుతున్నాయి. అధికారులు స్పందించి రైతులకు అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.